గుర్రాల దొంగలు

ఏ. వీ. మోహన్రావ్

సూర్యుడు కొండల్లోకి పోవటం చూచాడు పాల్.

ప్రక్కనున్న రాంసింగ్ తో "చీకటి పడుతున్న ట్లుంది, వెనక్కి వెళ్ళిపోదామా?" అడిగాడు.

"నీ యిష్టం. ఇవాళ మనకు ఒక్కటీ చిక్కలేదు. ప్రొద్దుట్నుంచి గాదాపు అరవై మైళ్ళ పైనే తిరిగిన ట్లున్నాం ఈ కొండల్లో" అన్నాడు రాంసింగ్.

"ప్రతిరోజూ దొరుకుతాయా? అయినా మనం వచ్చి ఇరవై దినాలు కాలేదు. దాదాపు పదింటిని పట్టుకున్నాం. జాగ్రత్తగా పట్టుకెళ్ళి అమ్ముకుంటే మూడు నాలుగు లక్షలకు తగ్గకుండా వస్తుంది" అన్నాడు పాల్.

పాల్ ఇండియాలోనే పేరు పొందిన హార్స్ ట్రైనర్.

అతనికీ గుర్రాలకూ తెలియని అనుబంధముంది. అతని చిన్న తనమంతా ఒక మహారాజుగారి గుర్రాల శాలలో, పని చెయ్యడంలోనే గడచిపోయింది. జాతి గుర్రాలను కడ గటం, నీళ్ళు పట్టడం, గడ్డి వెయ్యడం, జబ్బులొస్తే డాక్టర్ల దగ్గరకు తోలుకెళ్ళి వైద్యం చేయించడం అలాటి పనులన్నీ చేసేవాడు. వాటికొచ్చే జబ్బులూ, ఆ జబ్బులకు వాడే మందులూ మొత్తం అతనికి కంఠోపాఠంగా తెలుసు.

రాంసింగ్ ఆ కొండల్లో వున్న పెద్ద పల్లెలో వుండే మనిషి. పదివేల చదరపు మైళ్ళ విశాలంగా వున్న ఆ కొండల నడుమ భీకరమైన అరణ్యాలు, చిన్న చిన్న ఎడారులు, సెలయేళ్లు, వాగులు, రెండు పెద్ద నదులూ వున్నాయి. లెక్కలేనన్ని క్రూరమృగాలున్నాయి. రాం సింగ్‌కు ఆ ప్రదేశమంతా కొట్టిన పిండి. దానికితోడు అడు గుల్ని చూచి, అవి ఏ జంతువులో చెప్పగల దిట్ట. ఆ జాడల్ను పట్టుకుని ఎంత దూరమైనా తరుముకొనిపోయి ఆ జంతువులను చూపించగల నేర్పు వుంది.

పాల్ ఆ వూరు వచ్చి, రెండ్రోజులున్నాడు. ఊళ్లో జనమంతా అతన్ని వెలివేసినట్లు చూశారు. మొత్తం ఇర వయి గుడిసెలకు మించి లేవక్కడ. ఆ వూరికి నాయకుడు నారాయణసింగ్ అని తెలుసుకున్నాడు.

అతనెందుకు వచ్చిందీ చెప్పాడు పాల్.

విని నవ్వాడు నారాయణసింగ్.

"ఎందుకు నవ్వుతున్నావు?" అడిగాడు పాల్.

"ఈ అరణ్యాల్లోకి వెళ్ళిన మనిషెవ్వరూ ప్రాణాలతో తిరిగి రాలేదు. నువ్వు గుర్రాల్ని పట్టుకుంటామని వచ్చానం టున్నావ్. అవి అడవి గుర్రాలు. సింహాలకన్నా క్రూర మైనవి. అవంటేనే మాకు భయం!" అన్నాడు.

నారాయణసింగ్ గిరజాల జుట్టూ, నడుం చుట్టూ లావు పాటి తోలు బెల్టూ, తుపాకీ, బుల్లెట్లు నింపి అడ్డంగా వేసుకున్నా తోలుపటకా మనిషి భయంకరంగా వున్నాడు.

"నాకు భయం లేదు. రోజుకు వంద రూపాయలిస్తాను. నా వెంట ఎవరైనా వస్తారా?" అడిగాడు పాల్.

"ఎవ్వరూరారు అంతకు రెట్టింపిచ్చినాసరే!" అన్నాడు నారాయణసింగ్.

ఆరోజు సాయంత్రం పల్లెకు పడమరగా వున్న కల్లు దుకాణానికి వెళ్ళాడు పాల్. ఊళ్ళోవున్న పెద్దవాళ్ళంతా అక్కడ చేరివున్నారు. అందరూ మట్టి ముంతలు ముందె ట్టుకుని గంజాయి త్రాగుతున్నాయి.

పాల్ కూడా రెండు ముంతలు కల్లు తెచ్చుకుని వాళ్ళకు దూరంగా కూర్చున్నాడు.

మిగిలినవాళ్ళు త్రాగుతూ పాల్ను చూచి నవ్వుకుంటూ ఏదేదో చెప్పుకోసాగారు. వాళ్ళల్లోంచి ఒకతను, పొట్టిగా వున్న మనిషి లేచి వచ్చాడు పాల్ ముందుకు.

తన ముందున్న ముంతల్లోంచి ఒకటి తీసి అందించి "త్రాగు" అన్నాడు పాల్ అతన్ని.

ముంత అందుకుని కూర్చుంటూ "మనిషి కోసం చూస్తు న్నావటగా?" అడిగాడు ఆగంతకుడు.

"అవును!" అన్నాడు పాల్.

"నేనొస్తాను నీతో."

"నీ పేరు?"

"రాంసింగ్!"

"నీ కీ చుట్టు ప్రక్కలున్న అడవి, కొండలు బాగా తెలుసా?"

"ఈ పల్లెలో సుందరసింగ్ తర్వాత నన్నే చెప్పుకుంటారు ఆ విషయంలో" అన్నాడు రాంసింగ్.

"సుందరసింగ్ ఎవరు?" అడిగాడు పాల్.

దూరంగా కూర్చున్న గుంపులోంచి లేచిన ఒక ముసలతన్ని చూపించాడు రాంసింగ్. పాల్ అతన్ని తేరిపార చూశాడు.

"ఎప్పుడు వెళ్దాం అడవిలోకి?" అడిగాడు రాంసింగ్.

"రేపు వుదయాన్నే వెళ్దాం!" అన్నాడు పాల్.

అలా జరిగింది వాళ్ళ పరిచయం.

గుర్రాల్ని వెనక్కి మళ్ళించారు. ఒకదాని వెనుక ఒకటి మెల్లగా నడుస్తున్నాయి.

ఇరవై దినాలు అడవంతా కలయ తిరిగిన పాల్‌కు, ఎంతో ఉత్తేజంగా వుంది. గుర్రం కనుపించగానే దాన్ని పట్టుకోనేందుకు పడ్డ శ్రమ తలుచుకుంటే అతనికి ఆశ్చర్యం వేసింది. రాంసింగ్ నలిగిపోయిన ఆకుల్ని, ఊగుతుండే కొమ్మల్ని, కదలిపోయిన రాళ్ళను పలకరించి మాట్లాడి, తాము వెంటనే గుర్రం ఏ త్రోవన పరుగెత్తిందీ పసిగట్టి చెప్పేవాడు. పాల్ ధైర్యంగా ఆ త్రోవ వెంట వెళ్ళేవాడు.

అడవిలో తిరిగే గుర్రాలు భయంకరంగా కనుపించాయి పాల్‌కు. వాటివేగం, వాయువేగాన్ని మించి వున్నట్లు తోచింది. ఒక్కో గుర్రం పట్టుకోనేలోపల అడవంతా త్రిప్పి, ప్రాణాలు తోడేసేది. కొండల్ని సునాయాసంగా ఎక్కటంలోనూ, కొండచరియలపైనుంచి వంపల, వేల అడుగులు క్రిందికి జర్రున జారిపోటంలోనూ, నదులు దాటటంలోనూ, వాటి నేర్పు గమనించి బిత్తరపోయాడు పాల్.

“పాల్ సాబ్!” పిలిచాడు రాంసింగ్.

“ఏమిటి రాంసింగ్?” అడిగాడు పాల్.

“మేము ఎన్నేళ్ళనుండో ఇక్కడుంటున్నాం. ఈ అడవిలోని ఈ గుర్రాలకు ఇంత విలువ వుందనీ, వీటివల్ల ప్రయోజనం వుందనిగానీ మాకు తెలియనే తెలియదు. మా అవసరాలకు ఒకటో రెండో అతి కష్టంపైన పట్టి తెచ్చుకోవడం తప్ప, వాటితో వ్యాపారం చెయ్యవచ్చునని ఎవ్వరికీ తెలియదు” అన్నాడు రాంసింగ్.

“ఇప్పుడు నువ్వు తెలుసుకొన్నావుగా? ఇకపైన ఒక పని చేద్దాం! నువ్వు గుర్రాల్ని పట్టి నా దగ్గరకు తీసుకురా. వాట్ని అమ్మి వచ్చిన డబ్బు చెరిసగం తీసుకుందాం. నీకు అవసరమయిన పెట్టుబడి నేను పెడ్తాను.”

“అలాగే! మీరు ఈ గుర్రాలతో ఏం చేసేది నాకు చెప్పారు. మరెవ్వరికీ చెప్పకండి!” అన్నాడు రాంసింగ్.

“ఏం?” అడిగాడు పాల్.

“నారాయణసింగ్ ముఠా సోమరులు. దొంగలు. కష్టపడి పనిచేసే రకం కాదు. తుపాకితో మిగిలిన వాళ్ళను బెదిరించి పొట్ట నింపుకునే రకం. వాళ్ళకు తెలిస్తే ఈ గుర్రాలను పట్టుకోనివ్వరు. పైపెచ్చు మనం కష్టపడి పట్టుకొచ్చిన గుర్రాల్ని కూడా తమవేనంటారు” అన్నాడు రాంసింగ్.

“అలాంటి విపత్తులు ఎదురు చూచే తగిన ప్రయత్నంలో వచ్చాను. నా దగ్గర కావలసినంత అమ్యూనిషన్ వుంది. మంచికి ప్రాణాలిస్తాను. వంచించాలని చూస్తే ప్రాణాలు తీస్తాను. అయినా నే చెప్పిన రహస్యం నీలో నే వుంచుకో!” అన్నాడు పాల్.

గుర్రాలు మెల్లిగా కదులుతున్నాయి. అదలించి పరుగెత్తించడం యిద్దరికీ ఇష్టంలేదు. ప్రొద్దుట్నుంచి తిరిగి తిరిగి బాగా అలసి వున్న వాట్ని ఇంకా అలిసేట్లు జెయ్యడము అన్యాయమని తెలుసు వాళ్ళకు.

పాల్ తన మకాం ముందు ఆగాడు.

"ప్రొద్దున్నే వస్తాను సార్!" అన్నాడు రాంసింగ్.

"అలాగే!" అంటూ గుర్రం దిగాడు.

రాంసింగ్ గుర్రం అక్కడికి రెండుమైళ్ళ దూరంలో వున్న పల్లెవేపు పరుగెత్తిపోతుంటే కాసేపు చూస్తూ నిల్చున్నాడు పాల్. తన గుర్రాన్ని తీసుకెళ్ళి, గుడిసెకు వెనుక వేపునున్న మిగిలిన గుర్రాలతోపాటు కట్టేసి వచ్చాడు.

బట్టలు విప్పాడు. తుపాకులు తీసి ఒక మూలన పెట్టాడు బూట్లు కూడా విప్పుకున్నాడు. ఫోల్డింగ్ కాట్ సర్దుకుని వేసుకుని కూర్చున్నాడు.

పెద్ద చెక్కపెట్టె తెరచి, అందులోంచి రెండు బిస్కెట్ల పాకెట్లు తీసి మంచంపైన పెట్టుకుని మెల్లగా తినసాగాడు.

అందాకా తను సేకరించిన గుర్రాల్ని గురించే ఆలోచించసాగాడు. ప్రతి ఒక్కటీ జాతి గుర్రం. వాటి స్పీడు విమానాల్ని మించి వుంది. కొంచెం తర్ఫీదు ఇచ్చి రేసుల్లో వదిలిపెడితే, ప్రతి పందెం తప్పక గెలుస్తాయన్న నమ్మకం కలిగింది.

కనీసం డజను గుర్రాలనన్నా పట్టుకోవాలని వచ్చాడు. పది దొరికాయి. మరో రెండు దొరగ్గానే, అన్నింటినీ జైపూర్ తీసుకొచ్చి అక్కడ్నించి రైలుద్వారాబొంబాయి చేర్చే ఏర్పాట్లు చెయ్యాలనుకున్నాడు.

బిస్కెట్లు తినడం పూర్తయింది.

విస్కీ సీసా తెరచి, ఒక్క గుటకలో మొత్తం తాగాడు. రివాల్వరు నిండా గుండ్లు పెట్టి, దాన్ని తల క్రింద పెట్టుకుని పడుకున్నాడు.

పగలంతా తిరిగి తిరిగి అలసి వుండటం, ఆపైన విస్కీ తాగడంతో, వెంటనే కళ్లు మూసుకుపోయాయి. అతని శరీరం గాఢ నిద్రలోకి వొరిగిపోయింది.

గుర్రాలు మాత్రం సకిలిస్తూ, పచ్చిగడ్డి తింటూ, ఎగురుతూ పడుతూ, వాటి యిష్టంవచ్చినట్లు అల్లరి చెయ్యసాగాయి.

2

పాల్‌కు మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి చూశాడు. ఎండ తను తయారు చేసుకున్న గుడిసె కిటికీలోగుండా లోన పడుతోంది. లేచి కూర్చున్నాడు. అంతకు ముందు వరుసగా మూడు దినాలనుండి వినిపించిన గుర్రాల సకిలింపులు వినిపించలేదు. ఒకదాన్నొకటి రాచుకున్నప్పుడు విన వచ్చే సరసరలు కూడా వినరాలేదు.

'గుర్రాలన్నీ తనలాగే నిద్రపోతున్నాయా?' మనసులోనే అనుకున్నాడు పాల్. లేచి వెళ్ళాడు చూద్దామని గుడిసె వెనుక భాగానికి.

గుండె గుభిల్లుమంది. కళ్ళు బైర్లు క్రమ్మాయి. ఒక్క గుర్రం కూడా లేదు. వాటిని కట్టడానికి తను నాటిన కొయ్యలు మాత్రం వున్నాయి వెక్కిరిస్తూ. తెంపుకొని పోయి వుంటాయాని ఆలోచించాడు. త్రాళ్ళు తెగి వుంటే వాటి మొదళ్ళు కొయ్యలకు కట్టిన భాగం వేపు మిగిలి వుండాలి. అలా లేవు. కట్లు విప్పుకుని పోయినట్లున్నాయి.

ఇరవై దినాలుగా నిద్రాహారాలు లేకుండా, అడవంతా తిరిగి తిరిగి, ఏరి ఎన్నిక చేసి పట్టుకొచ్చిన గుర్రాలు మాయం కావడం అతన్ని నిలువునా కుదుపి వేసింది. మెదడు పని చెయ్యనారంభించింది.

అంతకు ముందు సాయంత్రం తనకూ, రాంసింగ్ కు జరిగిన సంభాషణ గుర్తొచ్చింది. ఈ గుర్రాల ఉపయోగం అతనికి తప్ప మరెవ్వరికీ తెలీదు. అతనే తను నిద్రపోతున్నప్పుడు వచ్చి గుర్రాలకట్లు విప్పి దొంగిలించుకుపోయి వుండాలనుకున్నాడు పాల్.

సర్రున గుడిసెలోపలకు వచ్చాడు. రెండు తుపాకులు తీసుకున్నాడు. రెండు వందల రౌండ్లు తూటాలు పేర్చుకున్నాడు తోలు పటకాను. రివాల్వరు బొడ్లో దోపుకున్నాడు.

నమ్మకద్రోహం చేసిన రాంసింగ్ ను తిన్నగా యముడి దగ్గరకు పంపి తన గుర్రాల్ని తిరిగి తన గుడిసెకు తోలుకు రావాలని కృతనిశ్చయుడైనాడు పాల్.

వెలుపల కొచ్చి ఎర్రగుర్రం ఎక్కి, కాళ్ళతో ప్రక్కటెముకలపైన అదలించినట్లు కొట్టాడు. ఒక్కమారు సకిలించి, ముందుకాళ్ళు రెండూ పైకెత్తి నిటారుగా నిలబడింది గుర్రం. ఆ తర్వాత కాళ్ళు రెండూ నేలపైన వేగంగా వేసి, పెద్ద పెద్ద అడుగుల్లో వేగంగా పల్లెవేపు సాగిపోయింది.

రాంసింగ్ మిగిలిన వాళ్ళతో చేరిపోయి తన పైకి దండెత్తే ప్రమాదముందని తెలుసు పాల్ కు. అయినా మొండిగా అవసరమైతే అందరితో తలపడేందుకు సిద్ధమయినాడు. ప్రాణాలు పోతాయేమోనన్న భయంగానీ,

అంతమందితో పోరాడటం కష్టమన్న ఊహాగానీ, అతనికి రాలేదు.

వెతికి వెతికి పట్టుకున్న జాతి గుర్రాలు పదీ గుర్తుకు రాసాగాయి. వాట్ని తిరిగి సంపాదించాలన్నదే అతని ధ్యేయం. ఎర్ర గుర్రం పది నిముషాల లోపలే చేరిపోయింది పల్లెకు. గుర్రాన్ని తిన్నగా ఊరి మూల వున్న కల్లు దుకాణం వద్దకు పోనిచ్చాడు. కొందరు ఆడవాళ్లు భయ పడుతూ లోనికి వెళ్ళారు. పిల్లలు దోవలొంచి తప్పుకు న్నారు.

కల్లు దుకాణం ముందు కళ్ళెం లాగిపట్టి, క్రిందకు దుమికాడు పాల్. పాక వెలుపల నారాయణసింగ్, అతని ముఠా మరో నలుగురు గుండెలు విరుచుకొని నిల బడి వుండటం గమనించాడు. వాళ్ళపై నుండి దృష్టి మరల్చి రాంసింగ్ కోసం కళ్ళతోనే వెతకసాగాడు. అతను కనుపించలేదు. ఏమయినాడా అని ఆలోచిస్తూ, దుకాణంలోకి వెళ్ళాడు.

కల్లు ముంతల్లో నింపుతున్న ముసలతను పాల్‌ను చూడ గానే భయపడుతూ లేచి వణకసాగాడు.

"ఎందుకలా అదిరిపడుతున్నావ్?" అని అడిగాడు పాల్.

"ఆ ముఠా నిన్ను చూడలేదా?" అడిగాడతను.

"ఏ ముఠా?" తెలియనట్లు అడిగాడు పాల్.

"నారాయణసింగ్ ముఠా!" చిన్నగా రహస్యం చెప్పి నట్లుగా అన్నాడు ద్వారం వంక బిక్కు బిక్కుమని చూస్తూ.

"నేను రావడం చూశారు. చూస్తే ఏం?"

"నీ కోసం కాచుకుని వున్నారు. రాగానే చంపాలను కుంటున్నారు. నువ్వు ఇటుప్రక్కగుండా వెళ్ళిపో!" మళ్ళీ మెల్లిగా చెప్పాడతను.

"రాంసింగ్ రాలేదా ఇవాళ?" అడిగాడు పాల్.

"వాడినడిగి లాభం లేదు! నన్నడుగు చెపుతాను" వెనకనుండి మాటలు వినిపించాయి. పాల్ కల్లు ముంతతో రక్కన తిరిగాడు వెనక్కి. నారాయణసింగ్ కనిపించాడు.

"నీకు తెలుసా?"

"తెలుసు."

"ఎక్కడున్నాడు?!'

"పైకి పంపాను. నువ్వూ వెళ్తావా?" కళ్ళు చింత నిప్పుల్లా చేసుకుని అడిగాడు నారాయణసింగ్.

"అంటే..." అర్థంగాక అడిగాడు పాల్.

"కాల్చి చంపాను రాత్రే!"

"చంపారా? ఎందుకు?"

"మా మాట విననందుకు. మా త్రోవకు అడ్డు రావాలని ప్రయత్నించినందుకు!" అన్నాడు నారాయణసింగ్.

పాల్ ఆ ఒక్క మాటలోనే జరిగిందంతా అర్థం చేసుకొన్నాడు. రాంసింగ్ వ్యక్తిత్వానికీ, విశ్వాసానికీ, త్యాగానికీ మనస్సులోనే జోహారు లర్పించాడు. అతన్ని చంపి, తన గుర్రాలను కాజేసిన ఈ ముఠాపై పగ తీర్చుకోవాలన్న తపన గుండెల్ని మండించింది.

"నువ్వు మనిషివి కావు, రాక్షసుడివి. రాంసింగ్ లాటి మనిషిని చంపడం నువ్వు చేసిన పెద్ద నేరం. కష్టపడి పట్టుకొచ్చుకున్న నా గుర్రాల్ని అపహరించడం రెండో నేరం.

నిన్ను..." అంటూండగానే నారాయణసింగ్ తుపాకీ పైకెత్తాడు పాల్ పైకి.

అసంకల్ప ప్రతీకార చర్యలా పాల్ చెయ్యి రక్కున రివాల్వర్ వైపు వెళ్ళింది.

"చెయ్యి ముందుకు కదిలిందా కాల్చిపారేస్తాను. ఎక్కడ్నుంచో వచ్చి, మా అనుమతి లేకుండా, మా అడవిలో గుర్రాల్ని తోలుకెళ్ళాలని ప్రయత్నం చేసినందుకు నిన్నూ, సాయంచేసినందుకు రాంసింగ్‌నూ చంపాలని తీర్మానించుకున్నాం!" అన్నాడు నారాయణసింగ్.

పాల్‌కు పరిస్థితి అర్థమయింది. ద్వారానికి అడ్డంగా నిలుచున్నాడు నారాయణసింగ్. ముందుదెబ్బ ఎవరిదయితే వాళ్ళదే పైచెయ్యి అవుతుందని తెలుసతని. ఇలాంటి సమయంలో, ఒక్క క్షణం ఆలోచించాడు. కల్లు ముంత ఒక్క వుదుటున నారాయణసింగ్ మొహానికి గురి చూసి కొట్టి, కూర్చున్నాడు. నారాయణసింగ్ తుపాకి పేల్చాడు. అది వెళ్ళి, పాల్ ఎడం భుజంలో దూరింది. కొరివిపెట్టి కాల్చినట్లు మంటపుట్టింది పాల్‌కు.

పాల్ కూర్చునే రివాల్వర్ పేల్చాడు నారాయణసింగ్ పైకి, అతని చేతిమణికట్టుకు తగిలింది గుండు. తుపాకీ క్రిందపడింది. నారాయణసింగ్ "అమ్మో!"అంటూ నేలపై వ్రాలాడు.

ఆ అరుపు వినగానే వెనుపలున్న అనుచరులు లోనికి రావటానికి ప్రయత్నించడం పాల్ కంటబడింది. గుమ్మానికి అడ్డంగా నారాయణసింగ్ ఆకారం పడిపోవడంతో అతనికేమయిందో చూచేందుకన్నట్లు, అతనిపైకి వంగారు.

అదే అదనుగా భావించాడు పాల్. వెనుక గుమ్మం

గుండా గుడిసె వెలుపలికొచ్చి, ఎర్రగుర్రానెక్కి అదిలించాడు.

గుర్రం గాడందుకుంది. తుపాకీ గుండు తగిలిన ప్రదేశంనుండి రక్తం కారసాగింది. లెక్కచెయ్యకుండా ముందుకు పోనిచ్చాడు గుర్రాన్ని, తిన్నగా గుడిసె దగ్గరకు జేరాడు. లోపల్నుంచి డబ్బూ, ఆహారం, బ్రాందీ సీసాలు, సిగరెట్లు, మొదలైన అవసర సామగ్రినంతా గుర్రంపై వేశాడు.

అక్కడింకా క్షణంవున్నా ప్రమాదమని తెలుసతనికి. నారాయణసింగ్ ముఠా, వెంటాడి వస్తారు. వాళ్లకుచిక్కకుండా ముందు పారిపోయి ఆ తర్వాత వచ్చి వాళ్లపైన చావుదెబ్బ తియ్యాలనుకున్నాడు.

దూరంగా గుర్రాల డెక్కల చప్పుడు వినిపించింది. పాల్ మళ్ళీ గుర్రమెక్కి అడవి వేపుపరుగెత్తించాడు.

3

పాల్ గుర్రం వేగంగా పోసాగింది.

అంతకుముందు రాత్రి ఆ ప్రాంతంలో వర్షం కురిసినట్లు చెట్ల ఆకులపై నుండి కొద్దికొద్దిగా నీళ్ళు నేలపైకి బొట్లు బొట్లుగా రాలుతున్నాయి. నేల తడిసి మెత్తబడి వుంది. పాల్ వంగి చూశాడు. గుర్రపు అడుగుల ముద్రలు అచ్చుగ్రుద్దినట్లు పడుతున్నాయి. అవి చూడగానే భయం పట్టుకుంది.

రాంసింగ్ అంతకుముందు చెప్పిన విషయాలు గుర్తొచ్చాయి. అడుగుజాడల్ని కనిపెట్టి, గుర్రాల్నికానీ, మనుషుల్నిగానీ, మరే జంతువులనుగానీ, పసిగట్టడంలో సుందర్ సింగ్ ఆరితేరిన దిట్ట. తన్ను వెంటాడుతున్న నారాయణసింగ్‌తో బహుశా అతడు కూడా వుండి వుంటాడు.

గుర్రం వేస్తున్న అడుగుల ముద్రల్ని బట్టి ఎంత అమాయకుడైనా వెంబడించి రాగలడు. వాళ్ళకు తనకూ మధ్యనున్నది కొద్ది దూరం మాత్రమే. అదీ గుర్రాల వేగాల్ని బట్టికాదు. వాళ్ళకన్నా తను కొంత ముందు బయలుదేరడం. ఆ ముఠావాళ్ళ గుర్రాలు కాస్త వేగం అందుకున్నాయంటే తనపని చెల్లు.

ఆలోచించసాగాడు పాల్. గుండు తగిలిన ప్రాంతం కారంజల్లిన పుండులా అప్పుడప్పుడూ మండుతూంది. బాటకు కుడివేపున ఎత్తైన కొండలున్నాయి. ఎడంవేపు ఆకొండల అడుగుల లోతున లోయ వుంది. దానిలోనికి వెళ్ళే మార్గం దాదాపు ఇరవై మైళ్ళ అవతల వుంది.

కొండలెక్కి పోదామనుకున్నాడు పాల్. కానీ పైకి ఎక్కటంలో వేగం ఆగిపోతుంది. ఈలోగా నారాయణ సింగ్ ముఠా వచ్చే అవకాశం వుంది. ముందుకు పోతూనే ఆలోచించసాగాడు.

లోయలోకి జారిపోదామనుకున్నాడు. చదునైననున్నని బండల్లాంటి కొండచరియలున్నాయి. అక్కడక్కడా చిన్న చిన్న చెట్లున్నాయి. గుర్రంతోపాటు ఆ చరియ పైగా జారిపోవడం అతికష్టం. గుర్రం కాళ్ళకు పట్టు దొరకదు. అది తడబడి చుట్టచుట్టుకుని క్రింద మీదయి, తనూ, గుర్రం కూడా నుగ్గు నుగ్గయ్యే ప్రమాదముంది.

ఎర్ర గుర్రాన్ని ఎగాదిగా చూశాడు. మంచి ఫారమ్‌లో వుంది. అది అడవి గుర్రం కావడంవల్ల, సునాయాసంగా గుట్టలుదాటుతూ, పొదల్ని తప్పించుకుంటూ ముందుకు పోసాగింది.

పాల్ వెనక్కి తిరిగాడు. దూరంగా సన్నగా గుర్రాల డెక్కల చప్పుడు వినవచ్చింది. అది నారాయణ

సింగ్ ముఠాయేనని తెలుసుకున్నాడు. అంటే వాళ్లు సరయిన దోవన, వేగంగానే, తరుముకుంటూ వస్తున్నట్లుగా వుందనుకున్నాడు. ఈ మారు వాళ్ళకు చిక్కితే తుపాకీ గుండ్లతో తూట్లు వేస్తారని తెలుసు.

. ప్రమాదమయినా, లోయలోకి పోవడానికే నిశ్చయించుకున్నాడు. గుర్రాన్ని బాటలోంచి ఆపించి కుడివేపునున్న కొండగుట్ట లెక్కించి వందగజాలు పోయాడు. ఆ తర్వాత ఆపి, బాటపై గుర్రం డెక్కలు పడకుండా రాతిపైనుండి బాట మీదుగా గుర్రాన్ని కొండచరియపైకి దూకించాడు గుర్రాన్ని, దమ్ముపట్టి.

గుర్రం దూకింది. కానీ దాని కాళ్ళకు పట్టు చిక్కలేదు. తిరగబడి దొర్లబోయి కూడా తమాయించుకొని పొజిషన్ నిలబెట్టుకుని ఇరవై గజాలు జర్రున జారింది. అక్కడ చిన్న పొద అడ్డొచ్చింది. దానిపైన కాళ్లు పెట్టి నిలుచుంది క్షణం.

అక్కడ్నుంచి లోయలోకి చూశాడు పాల్. ఇంకా చాలా దూరం వుంది. ప్రమాదకరంగా వుందా కటింగు. తలెత్తి పైకి చూశాడు. గుర్రం తల క్రిందులవకుండా ఎలా వచ్చిందాని ఆశ్చర్యపోయాడు. గుర్రం విపరీతమైన శబ్దం చేస్తూ ఊపిరి తీసుకోసాగింది.

ఎక్కువసేపు అక్కడుండటం ప్రమాదమని తెలుసు పాల్ కు. వెనుకనుండి తరుముకొస్తున్న నారాయణసింగ్ ముఠా, క్షణాలు గడిచేకొద్దీ దగ్గరవుతుంటారని కూడా తెలుసు.

కళ్లెంతో బిగబట్టాడు పాల్ భగవంతుడిపైన భారం వేసి గుర్రాన్ని మోకాళ్ళతో డొక్కల్లో పొడిచాడు. అది ఓసారి గాల్లోకి కాళ్ళుపైకెత్తి సకిలించి ముందు కురికింది.

బండమీద కాళ్ళు నిలుపుకోలేక, పడిపోయినట్లే వొంగి పోయింది. నాలుగు కాళ్ళూ వాలుగా ముడిచి, ఎత్తు తగ్గించుకొని, స్థిరంగ జారిపోసాగింది లోయలోకి.

అంతదూరం జారడానికి పట్టుమని పదినిముషాలుకూడా పట్టలేదు. దాని లాఘవానికి, నేర్పుకూ, తెలివికీ విస్తు పోయాడు పాల్. చిన్నగా లోయలోకి చేరుకుంది.

చుట్టూ చూశాడు పాల్. గుర్రాన్ని అదిలించి ముందుకు పోనిచ్చాడు. అరమైలు దూరం పోయాక, గుర్రం నోట్లోంచి నురుగు కారడం గమనించాడు. అంటే దానికి బాగా దాహమవుతుందని తెలుసుకున్నాడు. చుట్టూ నీళ్ల గుట్టలాంటి దేదైనా కనుపిస్తుందేమోనని అంతకు ముందు నుండి వెతుకుతూనే వున్నాడు. కానీ అలాంటిదేదీ కనుపించలేదు. తనకూ దాహమవుతూనే వుంది.

కొంతదూరం పోయాక కుడివేపు కొండక్రిందుగా ఒక చోట కొంతమేర ఖాళీస్థలం కనుపించింది.

గుర్రాన్ని అటు కదలించాడు. కొండ క్రిందికి వెళ్ళగానే అక్కడో చిన్న నీళ్ళ గుంట కనుపించింది. అతని కళ్ళు ఆనందంతో మెరిశాయి. మెల్లిగా క్రిందకు దిగాడు. గుర్రం తిన్నగా వెళ్లిపోయింది నీళ్లకోసం. దిగిన స్థలంలోనే కూలబడ్డాడు పాల్.

భుజం దగ్గర గుండు తగిలిన భాగం మండటం ఎక్కువయింది. శరీరం నీరసించడంతో తనకు జ్వరం తగులుతూందని తెలుసుకున్నాడు.

కళ్లు నొప్పులు పుట్టాయి. గుర్రం పడుకుని తల నీళ్లలో పెట్టి త్రాగుతూంది.

ప్రాకుతూ గుర్రం దగ్గరకు వెళ్ళాడు పాల్. జీను

క్రిందనున్న సంచీలోంచి, రెండు దుప్పట్లు తీసుకున్నాడు. వాటితో తిరిగి వెనక్కి పాక్కుంటూ వెళ్ళి, కొండ క్రిందుగా ఒక దుప్పటి పరచుకుని రెండోదాన్ని తలమునకా కప్పుకున్నాడు. చలికి అందాకా వొణికి పోతున్న శరీరం కాస్త తట్టుకున్నట్లయింది. మత్తుగా నిద్రలోకి జారుకున్నాడు.

4

పాల్ కళ్ళు తెరచి చూచేసరికి చుట్టూ చీకటి పేరుకుని వుంది.

దగ్గరలో గుర్రం పడుకుని తనకేసి చూస్తూ వుంది. తెలియని వేడి ఏదో ఆ ప్రదేశాన్నంతా ఆవరించినట్లువుంది ఎర్రటి వెలుగు కూడా కనుపించింది.

వెనక్కి తిరిగి చూశాడు. ఎండిన పుల్లలు మండుతున్నాయి. భుజంపైన గాయంనొప్పి కూడా అంత ఎక్కువగా తెలీలేదు. తడుము కొన్నాడు పాల్. కట్టు తగిలింది. తలవొంచి చూసుకున్నాడు.

పాతగుడ్డ చేతిచుట్టూ కట్టబడి వుంది.

నిర్మానుష్యమైన అరణ్యంలో, ప్రాణాలు తీసేందుకు తరుముకొస్తున్న హంతకులకోసం ఎదురుచూసిన తనను ఆదరించిందెవరాని చుట్టూ చూశాడు పాల్. ఎవ్వరూ కనుపించలేదు.

ఆశ్చర్యమేసింది. స్పృహలేని స్థితిలో తను పడివున్నప్పుడు ఆ మనిషి ఎవరో వచ్చి వెళ్లి వుండాలనిపించింది. అంతలోనే మరో అనుమానం కూడా కలిగింది. అడవుల్లో కొరివి దయ్యాలుంటాయి. ఒక వేళ ఇదంతా వాటి పనేమో ననుకున్నాడు. పాల్ కు దయ్యాలంటే భయమేమీ లేదు.

కనీసం ఆ దయ్యమైనా కన్పిస్తే, కృతజ్ఞత తెలియ బరచాలనిపించింది.

ఎర్రగుర్రం హాయిగా ఎర్రగా మండుతున్న మంట దగ్గరగా చేరి పడుకుని చలిని కాచుకుంటూవుంది. పాల్ దాని కోసం చూశాడు. మామూలు మనిషెవ్వరూ చెయ్యని సాహసం చేసింది అది తన్ను కాపాడేందుకు. తల్లికన్న మిన్నగా పూజించాలనీ, బిడ్డకన్నా ఎక్కువగా ప్రేమించాలనీ, అవసరమైతే ప్రాణాలైనా పణంగాపెట్టి దాన్ని కాపాడుకోవాలనీ అనిపించింది.

గాజులశబ్దం వినిపించింది దగ్గరలో.

తల త్రిప్పి చూశాడు పాల్.

ఒక స్త్రీ ఆకారం లీలగా కనుపించింది. కళ్లు నులుముకుని మోచేతిపైన బరువంతా వేసి కాస్తపైకి లేచి చూశాడు. అనుమానం లేదు. ఆమె తనవేపే వస్తూందని నిర్ధారణ చేసుకొన్నాడు. దగ్గరకంటూ వచ్చి నిలుచుందామె తదేకంగా చూస్తూ.

ఆమె రూపం మనోహరంగా వుంది. రెండు జడలు వేసుకుంది. ఆ రెండూ భుజాలపైనుంచి ముందుకు రెండు రొమ్ముల పైన పడివున్నాయి. ఆ రొమ్ముల ఎత్తు ఆ జడల కున్న గంటల్లాంటి వాటి ఊపుల్నిబట్టి ఊహించగలిగాడు. కళ్ళు విశాలంగా వున్నాయి. చిన్ననోరు. పొడవుపాటి ముక్కు. సన్నటి నడుము, అపురూపసుందరి అని లోలోపలే అనుకున్నాడు.

"ఎలా వుంది?" అడిగింది. ఆ గొంతులో మార్దవం లేదు.

"ఏది?" తెలీనట్లు అడిగాడు పాల్.

"గాయం!" ప్రక్కనే కూర్చుంటూ చెప్పింది.

"నొప్పి తగ్గింది. నువ్వెవరు?"

"ఎవరైతే నీ కెందుకు. అసలు నువ్వెవరు? నిన్నెవరు కాల్చారు? ఎందుకు కాల్చారు? అడవిలో ఎందుక తిరుగుతున్నావ్?" వర్షంలా కురిశాయి ప్రశ్నలు.

అందాకా జరిగింది క్లుప్తంగా చెప్పాడు. విని వింతగా చూసింది అతనికేసి.

"వాళ్లెంతమంది వున్నారు!"

"ముగ్గురులా వుంది!"

"వాళ్లల్లో సుందరసింగ్ వున్నాడా?" అడిగింది ఆమె.

"అంటే వయసు మళ్ళిన ముసలతన్ని గురించేనా నువ్వడిగేది?"

"అవును అతన్ని గురించే..." అందామె.

"ఉన్నాడు." అన్నాడు పాల్ పడుకునే.

"అయితే నువ్వు వాళ్లనుండి తప్పుకోవడం అసాధ్యం, ఆ సుందరసింగ్ ఎటువంటి జాడలైనా నాగుపాములా వాసన చూసి పసిగట్టగలదిట్ట. అతను వెంటాడుతున్నాడంటే నీకు చావు రాసిపెట్టినట్లే!" అందామె నిరాశగా.

"చావంటే భయంలేదు నాకు. బ్రతకాలన్న కోరికా లేదు. అయితే చచ్చేముందు వాళ్ళను చంపిగాని చావను. నేను అష్టకష్టాలుపడి పట్టుకొన్న గుర్రాల్ని అపహరించడంగాక, అడిగినందుకు ఇలా నా పైన దౌర్జన్యం చేయబోయిన వాళ్ళను ఊరకే వదిలెయ్యడం మగతనం కాదనిపిస్తోంది!" అన్నాడు పాల్.

ఆ మాట వినగానే ఆమె కళ్ళలో మెరుపు మెరిసింది.

"నీకు నేను సాయం చేస్తాను." అందామె.

"నువ్వా? సాయం చేస్తావా? ఆడవాళ్ళసాయం అవసరం లేదు నాకు. నేను పగతీర్చుకోగలను." అన్నాడు పాల్.

ఆ మాటలకు ఆమె అహం, దర్పం దెబ్బతిన్నాయి.

"ఆ ఆడవాళ్ళే నీ ప్రాణాలు ఈ పాటికి పోకుండా కాపాడింది. నిన్నూ, నీ గుర్రాన్నీ, ఈ రహస్య స్థలానికి చేర్చి, గాయానికి కట్టుగట్టి చలికి గడ్డకట్టుకొని పోకుండా మంట వేసింది వెళ్ళింది కూడా ఆడదే! ఈ ఆడదే!" అంటూ కోపంగా చెప్పింది తన్ను తాను చూపించుకుంటూ.

పాల్ కు తను తొందరపడి మాట జారినందుకు, ఆమె మనస్సు నొప్పించి నందుకు బాధ కలిగింది.

"సారీ! తొందరలో అలా అనేశాను. నా ఉద్దేశ్యం నీ గురించిగాదు!" అని చెప్పాడు తప్పించుకుందామని.

"డోంట్ వర్రీ! వొంట్లో ఎలా వుందో చెప్పు!" అందామె.

పాల్ ఆమె ఇంగ్లీషు మాట్లాడటం విని నోరు వెళ్ళబెట్టాడు ఆశ్చర్యంగా.

"యెందుకలా ఆశ్చర్యపోతున్నావ్?" అడిగింది ఆమే మళ్ళీ.

"నీకు ఇంగ్లీషు వచ్చా?"

"వచ్చు!"

"ఎక్కడ నేర్చుకున్నావ్?" అడిగాడు పాల్.

"జయపూర్ లో."

"అక్కడ మీ వాళ్లెవరన్నా వున్నారా?"

"లేరు. ఒకప్పుడు నా భర్త వుండేవాడు. అయనతో

కాపురం చేశాను. ఆయనే నేర్పారు కొద్దిగా ఇంగ్లీషు ముక్కలు.'' అందామె.

''ఇక్కడికెందుకొచ్చావ్?'' అడిగాడు పాల్.

''పగతీర్చుకుందామని.''

''ఎవరి మీద.''

''నా భర్తను చంపిన రాక్షసులపైన...''

''ఎవరా రాక్షసులు?''

''నిన్ను తరుముతున్న ముఠాయె. ఆ సుందరసింగ్ నా భర్తను వేటాడాడు, ఆ నారాయణసింగ్ తుపాకీతో కాల్చిచంపాడు,'' అంది. అంటూంటే ఆమె కళ్ళు కక్షతో కసితో, కోపంతో నిప్పుకణాల్లా మారిపోయాయి.

''ఎందుకు చంపారు?''

''మా నాన్న, తమ్ముడు ఇక్కడే వుండేవాళ్ళు. నేను పెళ్ళి చేసుకుని వెళ్ళాక మా నాన్న పెంచుతున్న గొర్రెల మందల్లోంచి దొంగతనంగా కొన్నింటిని రోజూ కాజెయ్యసాగారు. ఆయన వీళ్ళని హెచ్చరించను వెళ్ళాడు. వెళ్ళిన మనిషి తిరిగి రాలేదు. మా తమ్ముడు పసికుంక, పట్టుమని పదేళ్ళు కూడా లేవు. వాడు నడుచుకుంటూ వచ్చాడు నా దగ్గరకు. నా భర్తకు కోపం వచ్చింది. నారాయణసింగ్ పై పగ తీర్చుకుంటానికి వద్దన్నా వినకుండా వచ్చాడు. ఆయన్ను కూడా దొంగతనంగా చాటునుండి కాల్చి చంపారు. ఆ తర్వాత నేను వచ్చేశాను. మా తమ్ముడూ నేనూ వుంటున్నాము ఇక్కడికి దగ్గర్లోనే. సమయంకోసం ఎదురుచూస్తూ వున్నాం.'' అందామె.

ఆమె విషాదగాథ విన్నాక పాల్ అవాక్కయి కూర్చున్నాడు కొన్ని క్షణాలు.

"ఎన్నాళ్లయింది జరిగిదంతా?" అడిగాడు పాల్.

"రెండేళ్ళయింది!"

"నువ్వు వచ్చి ఇక్కడే వుంటున్నట్లు వాళ్లకు తెలీదా?"

"తెలుసు!"

"మరి నీ జోలికి రావడంలేదా?"

"రారు! వాళ్ళతో తియ్యగా మాట్లాడి పంపించేస్తుంటాను. ఒకటో రెండో గొర్రెల్ని కూడా అప్పుడప్పుడూ తోలిపెడుతుంటాను. ఇప్పటిదాకా తగిన సమయం చిక్కలేదు. సమయం చిక్కితే వాళ్లను మట్టుబెట్టి నా ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్నాను" అందామె. తొణుకు బెణుకు లేకుండా.

పాల్ ఆమె పట్టుదలకూ, అది సాధించడానికి తీసుకున్న పథకానికీ, వహిస్తున్న ఓర్పుకూ పొంగిపోయాడు.

"నీ చేత చచ్చేందుకు బహుశా ఇద్దరూ వుంటారనుకోను. నాతో జరుగుతున్న పోరాటంలోనే ఒకరో లేక ఇద్దరూనో చస్తారు. నేను చావబోయే ముందు కనీసం ఒకరినన్నా చంపుతాను." అన్నాడు పాల్.

"అలాగుండాలి మగాడంటే! నువ్వు నాకు నచ్చావ్ అయితే ఎందుకిలా పారిపోతున్నావ్ వాళ్ళనుండి. ధైర్యముగా నిలబడలేదేం?" అడిగిందామె.

"నన్ను వాళ్ళు పిస్తోలుతో కాల్చారు. చూశావుగా. గాయమైంది. చాలా రక్తం పోయింది. నీరసంగా కూడా వుంది. కాస్త ఓపిక వచ్చేదాకా వాళ్ళనుండి దూరంగా వెళ్ళాలనుకున్నాను. కుదుటపడగానే యెదుర్కొందామనుకున్నాను. నా జాడలు చిక్కకుండా వుండాలని

గుర్రాన్ని ఆ కొండపైనుంచి ఏటవాలుగానున్న రాతి చరియమీదుగా దూకించుకొచ్చాను. అందువల్లే వాళ్ళు వెనకబడిపోయి వుంటారు. నా జాడ చిక్కి వుండదు.'' అన్నాడు పాల్.

''ఆ సుందర్ సింగ్ సంగతి నీకు తెలీదు. కాసేపు ఎటు పోయిందీ అర్థంగాక తికమకపడ్డా ఆ తర్వాత ఊహిస్తాడు. మట్టిలో కూరుకొనిపోయిన చిన్న రాతిబెడ్డ కదిలినా చాలు, అతను పసిగడతాడు. నీ ప్రోగ్రాం ఏమిటి?''

''ఏమీ లేదు! ఇంకాస్త ఓపిక వచ్చేదాకా ఇక్కడే విశ్రాంతి తీసుకుంటాను.'' అన్నాడు పాల్.

ఆమె అనుమానంగా చుట్టూ చూసింది.

''ఇక్కడొద్దు! నా వెంట రా! గుడిసెకి తీసుకుపోతాను. అక్కడే వుండు యివాళంతా. ఆ తర్వాత ఆలోచిద్దాం!'' అంది.

''వద్దు! నావల్ల నువ్వు ఆపదలో చిక్కుకోవడం నా కిష్టంలేదు. ఇక్కడే వుంటాను. ఫరవాలేదు.'' అన్నాడు పాల్ ఆమెవెంట పోవడం యిష్టంలేక.

''నీ మంచికోరి చెప్తున్నాను. వెంటరా! నీ గుర్రాన్ని మాత్రం ఇక్కడే వదిలేసి పోదాం! అది గడ్డి తిని తిరుగుతూ ఉంటుంది. నువ్వు కుదుటపడ్డాక వెళ్ళిపోదూ గానీ!'' అందామె.

''నీ పేరు చెప్పలేదు! నా పేరడుగ లేదు. నేను మంచివాణ్ణా, దుర్మార్గుణ్ణా తెలుసుకోకుండా వెంట రమ్మంటున్నావ్ ఇంటికి.'' అన్నాడు పాల్.

''నా పేరు లీనా! జ్వరంతో బాధపడే నువ్వు మంచివాడివాయినా, చెడ్డవాడివయినా ఒకటే! రా పోదాం!'' అంటూ లేచి నిలుచుంది.

పాల్ కూడా సిగరెట్లు, బిస్కట్లు, రివాల్వర్లు తీసుకుని లేచాడు. రెండడుగులు వేశాడు. కానీ వళ్ళు స్వాధీనంలో లేక నిలబడలేకపోయి, ఠక్కున కూలిపోయాడు.

లీనా వెనక్కి తిరిగి చూసింది. వెళ్ళి అతన్ని లేవదీసి, ఒక చెయ్యి తన భుజంమీదుగా వేసుకుని, పాల్ నడుంను చుట్టి పట్టుకొంది. అతని బరువునంతా తనపై వేసుకుని నడవసాగింది ముందుకు.

అందమైన ఆమె శరీరం తగలగానే అంతకు ముందు దాకా జ్వరంతో కాగి చల్లారిన నరాలు, కండలు, మళ్ళీ వేడెక్కసాగాయి. అలాంటి అనుభూతిని ఆశించడంగానీ, ఆలోచనలు బుర్రలోకి తెచ్చుకోవటంగానీ అనుచితమని తెలిసినా మనస్సును అదుపులో పెట్టుకోలేకపోయాడు.

కొండ క్రిందనుండి దాదాపు రెండు ఫర్లాంగులు నడిపించింది లీనా పాల్ను. ఆ తర్వాత చిక్కటి చెట్లలోగుండా మరికొంతదూరం తీసుకెళ్ళింది. ఆ చెట్లలోపల చిన్నగుడిసె కనుపించింది పాల్కు. అక్కడో ఇల్లు వుందని కనిపెట్టడం ఎవ్వరికీ సాధ్యంగాదు.

పాల్ను గుడిసెలోకి చేర్చి, వెదురుబొంగులతో తయారు చేసిన మంచంపైన పడుకోబెట్టింది లీనా. గొట్టెపాలు మట్టి కుండలో పోసి పొయ్యిపైన పెట్టి వచ్చి కూర్చుంది ఎదురుగా మరో మంచంపైన.

"మీ తమ్ముడేడీ?" అడిగాడు పాల్.

"అడవిలోకి పోయివుంటాడు. ఇక్కడ లేడు." అంది లీనా.

"నారాయణసింగ్ ముఠా అతన్ని చూసి వెంట వస్తే..." తన అనుమానం వ్యక్తంచేశాడు.

"ఎందుకు?"

"నా జాడేమైనా నీకు తెలుసేమో కనుక్కోనేందుకు."

"రానీ!" అంది నిర్లక్ష్యంగా.

"నేను ఇక్కడ వుండటం చూస్తే అందర్నీ నిలువునా కాల్చిపారెయ్యరూ..."

"చూద్దాం!" అంది లీనా.

లీనా లేచివెళ్ళి పొంగిన పాలను గ్లాసులో పోసి తెచ్చింది. త్రాగమంటూ అందించింది. పాల్ అందుకొని త్రాగసాగాడు. అమృతంలా వున్నాయనిపించాయి పాలు.

పాల్‌కు లీనాని చూస్తుంటే మతి స్వాధీనం తప్పిపోతున్నట్లుగా వుంది. తన్ను తను కంట్రోలు చేసుకోలేక పోతున్నాడు. అంతకుముందు ఎంతోమంది స్త్రీలు తారసపడ్డారు కానీ ఎవ్వరూ తనకు తగినవాళ్ళుగా తోచలేదు. ఈమెమాత్రం మనస్సును కలవరపరుస్తున్నట్లుగా ఫీలయినాడు.

అడవిలో క్రూరమృగాల మధ్య, అంతకన్నా క్రూరమైన ప్రకృతి, పరిసరాలు, మనుషులమధ్య, ధైర్యంగా జీవించగలుగుతూన్నది కాబట్టే పాల్‌కు ఆమెపైన ఎనలేని అభిమానం, అనురాగంలాంటివి పుట్టుకొచ్చి వుండాలి. అతనికి అలాంటి జీవితమంటే ఇష్టం.

5

తలుపు తోసుకుని పన్నెండేళ్ళ కుర్రాడు లోనికొచ్చాడు.

"అక్కా! అక్కా! ఆ రాక్షసులు తారసపడ్డారు!" అన్నాడు రాగానే.

"ఎవర్రా?" అడిగింది లీనా నిమితంగా.

"ఇంకెవరు? నారాయణసింగ్, వాడి ముఠా!" చెప్పాడు ఆ కుర్రాడు.

పాల్ అసంకల్పంగా నేరివాల్వరు చేతికి తీసుకున్నాడు.

"నిన్నేమన్నా అడిగారా?" అడిగింది లీనా.

"తుపాకీదెబ్బ తిని, గుర్రంమీద పారిపోతున్న మనిషి నెవరన్నా చూశావా, అని అడిగాడు సుందరసింగ్. లేదన్నాను."

"తర్వాత."

"ఆ నారాయణసింగ్ గాడు ఆ మనిషిని వెంటాడి వేటాడేందుకు తాము వచ్చామనీ, ఇప్పటిదాకా చూడకుంటే, వెళ్ళి వెతికి జాడ తెలుసుకొనివచ్చి చెప్పన్నాడు."

"చెప్పకుంటే!"

"కాల్చి పారేస్తానన్నాడు."

"రాస్కెల్! ముందు వాడ్ని కాల్చిపారెయ్యాలి. అప్పుడుగాని నగం పీడ వదలదు." అంది లీనా కోపంగా.

"లీనా!" పిలిచాడు పాల్.

ఏమిటన్నట్లు అతనికేసి చూసింది.

"నేను ఇక్కడుండను. వెళ్ళిపోతాను. వాళ్లు ఇటొస్తారేమో?" అన్నాడు పాల్.

మాట పూర్తి గాకముందే దూరంగా గుర్రాల డెక్కల చప్పుడు వినిపించింది. ముగ్గురూ మౌనంగా ఊపిరి బిగబట్టుకొని విన్నారు.

"వస్తున్నారు వాళ్ళు!" అంది లీనా.

"రానీ! తాడో పేడో ఇప్పుడే తేల్చేస్తాను." పాల్ తుపాకి పైకెత్తాడు.

"వద్దు! నువ్వు నాతో రా!" అంటూ ఆమె పాల్ ను గుడిసె వెనక్కి నడిపించుకు పోయింది, పదిగజాలు

పోయాక పెద్ద చెట్టొకటి చూపించి "పైకెక్కి ఆ కొమ్మల్లో దట్టంగావున్న ఆకులమధ్య కూర్చో! వాళ్ళు వెళ్ళాక వచ్చి పిలుస్తాను." అంది లీనా.

పాల్ మారుమాట చెప్పకుండా చెట్టెక్కాడు చక చక కోతిపిల్లలా. కొమ్మల్లోకి వెళ్ళి కూర్చున్నాడు. లీనా పైకి చూసింది. అతను కనుపించలేదు. నిబ్బరంగా గుడిసెలో కొచ్చింది.

గుర్రాల చప్పుడు దగ్గరగా వినవచ్చింది. రెండు నిముషాల తర్వాత నారాయణసింగ్ గుడిసెముందు నిలబడి "లీనా! లీనా!" పిలిచాడు.

"ఎవరు?" అంటూ వెలుపలికొచ్చింది లీనా.

"మేము!" అన్నాడు సుందరసింగ్. అతని కళ్ళు పరిసరాల్ని పరిశీలిస్తున్నాయి. చెవులు వింత శబ్దాలకోసం రిక్కించుకున్నాయి. నరవాసన చూసే పులిలా అతని ముక్కుపుటాలు పెద్దవి అవుతూ అదిరిపడుతున్నాయి.

"అర్ధంతరంగా ఇలా వచ్చారేం?" అడిగింది లీనా.

"ఒక మనిషిని వేటాడుతూ వచ్చాం. అతను అందకుండా పారిపోతున్నాడు. ఇటెవరన్నా క్రొత్త మనిషెవరన్నా వచ్చారా?" అడిగాడు నారాయణసింగ్.

"లేదే! ఎవ్వరూ నాకు కనుపించలేదు." అంది లీనా.

"మాకు బాగా ఆకలిగా వుంది. తినేందుకేమయినా వుంటే పెట్టరాదూ!" అడిగాడు సుందరసింగ్.

"ఏమీ లేనట్లుంది. అయినా చూసొస్తాను!" అంటూ లీనా లోనికి వెళ్ళింది.

"ఓమారు లోపలకూడా చూస్తే బాగుంటుంది." అన్నాడు సుందరసింగ్.

"నీ ముసలిబుద్ధి పోనిచ్చుకున్నావు గాదు. వాడు ఇటొచ్చి ఉంటే లీనా పట్టి మనకు అప్పగించేది కదా?" అన్నాడు నారాయణసింగ్.

"ఏమో? చూచినందువల్ల తప్పు లేదుగా?"

"సరే పద!" అన్నాడు నారాయణసింగ్.

ముగ్గురూ లోనికి నడిచారు. వాళ్ళ వెంట వున్న మూడో మనిషి పేరు ప్రేంసింగ్. అతనికి స్వంతమైన వ్యక్తిత్వమంటూ లేదు. యంత్రంలాంటి మనిషి. నారాయణ సింగ్ చెయ్యమన్నదల్లా చెయ్యడం తప్ప స్వతంత్రంగా ఏమీ చెయ్యడు.

"ఇంట్లో ఏమీ లేదు! పాలున్నాయి తాగుతారా?" అడిగింది లీనా.

సుందరసింగ్ మంచం ప్రక్కనున్న లోటాకేసి చూశాడు. వెళ్ళి దాన్నందుకొన్నాడు. వేడిగా తగిలింది.

"ఇవ్వు! తాగుతాం!" అంటూ గ్లాసు అందించాడు సుందరసింగ్.

లీనా అందుకుంది. పాలు తెచ్చి ఆ గ్లాసులోనే పోసి ఒకరి తర్వాత ఒకరికి ఇచ్చింది. ముగ్గురూ తాగారు.

"నీకున్నాయా? మొత్తం మేమే తాగామా?" అడిగాడు సుందర్ సింగ్ నవ్వుతూ.

"మీరు తాగండి. నాకు అవసరం లేదు!" అంది లీనా.

ఆ జవాబుతో సుందరసింగ్ కు అనుమానం కలిగింది. పాల గ్లాసు అడుగున కొద్దిగా పాలు కనిపించాయి. లీనా గ్లాసు తీసుకొని వెళ్ళబోయే ముందు బహుశా ఆమె తాగి వుంటుందేమోనన్న అనుమానంతో అడిగాడు. కానీ ఆమె తనకు అవసరం లేదని చెప్పింది. అంటే ఆ గ్లాసులో పాలు తాగింది ఎవరు?

పాల్‌ను తాము వెంటాడి వచ్చారు. ఉన్నట్టుండి తప్పించుకు వెళ్ళాడు. ఆ తర్వాత ఎంత వెతికినా అతని జాడగానీ, గుర్రం జాడగానీ చిక్కలేదు. అంటే అతన్ని లీనా కలుసుకొని, కాపాడుతానని మాటిచ్చిందేమోనను కున్నాడు సుందర్‌సింగ్. అయితే అతన్ని ఎక్కడన్నా దాచి వుండాలి! ఎక్కడ దాచి వుంటుందా అని ఊహించ సాగాడు.

సుందరసింగ్ గుడిసె వెలుపలకొచ్చి, నాలుగుప్రక్కలా పాల్ గుర్రం కోసం తేరిపార చూశాడు. దాని జాడ లేదు. అంతలో నారాయణసింగ్ కూడా వెలుపలకొచ్చి నిలుచున్నాడు.

“ఏమిటి మామా వెతుకుతున్నావ్?” అడిగాడు నారాయణసింగ్.

తన ఆలోచనలు, అనుమానాలు విపులంగా చెప్పాడు సుందరసింగ్.

“ఏం చేద్దాం?” అడిగాడు నారాయణసింగ్.

“మనమీ ప్రదేశంపైన ఒక కన్ను వేసి వుంచాలి!” అన్నాడు సుందరసింగ్.

“ఎలా?”

“మనకెటూ ఆకలిగా వుంది. వంటచేసి భోజనం పెట్ట మని అడుగుదాం! ఆమె కాదనలేదు. వంట కావటానికి రెండు గంటలు పడుతుంది! ఈలోగా చుట్టుపక్కల అన్ని ప్రదేశాలు వెతుకుతాను పాల్‌గాడి ఆచూకీ కోసం!” అన్నాడు సుందర్‌సింగ్ మళ్ళీ.

“అలాగే!” అన్నాడు నారాయణసింగ్.

ప్రేంసింగ్ ద్వారా లీనాకు చెప్పి పంపాడు భోజనం సంగతి. ఆమెకు చిర్రెత్తుకొచ్చింది. అయినా కాదనే

మార్గంలేక ఒప్పుకుంది. వెంటనే పనిలో మునిగిపోయింది.

ముగ్గురూ మూడు వేపులా వెళ్ళి వెతకడం ప్రారంభించారు. గుడిసె వెనుక వున్న చెట్లవేపు వెళ్ళాడు సుందరసింగ్. చాలా దట్టంగా, ఎత్తుగా వున్నాయి చెట్లు. ఒకటీ రెండూ కాదు. వందలున్నాయి. ఆ చెట్ల క్రింద ఆకుల నీడలవల్ల కన్ను పొడుచుకున్నా కనుపించనంత చీకటిగా వుంది. సుందరసింగ్ తలెత్తి పైకి చూశాడు కానీ ఎవరైనా మనిషి సులభంగా ఏదో ఒక చెట్టెక్కి దాక్కోవడం సాధ్యమన్న విషయము అతనికి అర్థమైంది. పైకి ఎక్కి వెతికే అవకాశం లేదు.

ఎందుకయినా మంచిదని తుపాకీ తీసి పైకి గురిపెట్టాడు సుందరసింగ్. నాలుగు రౌండ్లు కాల్చి చూస్తే పైనెవరన్నా మనిషి వుంటే భయపడి క్రిందకు దిగిరావడమో, లేక అదృష్టం బావుంటే ఏదో ఒక గుండు తగిలి చావడమో జరుగుతుందని ఆలోచించాడు. అంతలో ప్రేంసింగ్ కూడా వచ్చాడక్కడకు. అతనికి తను చెయ్యదలచుకున్నది చెప్పాడు. తనూ నాలుగు రౌండ్లు పేలుస్తానన్నాడు ప్రేంసింగ్.

ఇద్దరూ కలిసి కాల్పులు మొదలు పెట్టారు. నిశ్శబ్దం చీల్చుకుంటూ ప్రేలిన తుపాకి గుళ్ళ శబ్దంతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది.

లీనా చేస్తున్న పని వదిలేసి పరుగెత్తుకుపోయింది గుడిసె వెనుక వేపుకు. ఆమె గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. సుందరసింగ్, ప్రేంసింగ్ ఇద్దరూ చెట్ల కొమ్మల్లోకి తుపాకులు ఎక్కుపెట్టి నిలుచుని వుండటం గమనించింది.

అలా కాల్చవద్దని చెప్పాలనుకుంది ముందు. అలా చెప్పగానే తన్ను ఆ ముసలి నక్క అనుమానిస్తాడని తెలుసు. అపకుంటే అవిరామంగా కాలుస్తూనే వుంటా రేమో! ఏదో ఒక గుండు పాల్కు తగిలితే...ఇక ఆ పైన ఆలోచించలేకపోయింది.

"ఎందుకిలా ఆత్రతగా వచ్చావ్?" అడిగాడు సుందర సింగ్.

"మీలో మీరు కాల్చుకుని ఛస్తున్నారేమోనని" అంది రక్కున తడుముకోకుండా.

"లేదు."

"మరి ఎందుకిలా ఆకాశంలోకి కాలుస్తున్నారు?"

"కూరలోకి పిట్టలేమయినా దొరుకుతాయేమోనని" అన్నాడు సుందరసింగ్.

"ఈ చెట్లపైన పిట్టలుంటాయా? ఇన్నేళ్ళు అడవిలో తిరిగి ఆ మాత్రం తెలీదా నాకు? నేనేదో ఆ పారిపోయిన మనిషికి సాయం చేశాననీ, అతన్ని ఎక్కడో దాచి వుంచాననీ నీ అనుమానం. నీ యిష్టం. ఆ మనిషి కను పించేలోగా వున్న గుండ్లన్నీ ఖర్చు చేసుకోండి. ఆ తర్వాత అతను కాలుస్తుంటే మీరు చేతులు అడ్డుపెట్టి ఆపి, ప్రాణాలు కాపాడుకుందురుగానీ..." అంది లీనా.

ఆ మాటలు ప్రేంసింగ్ తల్లోకి ఎక్కాయి. అతను కోపంగా సుందరసింగ్ కేసి చూశాడు. ఇద్దరూ తుపా కులు క్రిందకు దించారు. లీనా తిరిగి గుడిసెవేపు నడిచింది.

"ముసిలోడికి ఆలోచన వుండదు" అన్నాడు ప్రేం సింగ్.

"మాటి మాటికీ ముసిలోడినని నన్ను నువ్వు ఎగతాళి

చెయ్యవద్దు. నేను లేనిది క్షణం జరగదు మీకు'' అన్నాడు సుందరసింగ్.

''నువ్వు ఛస్తేగానీ మాకు శని వదలదు!'' అంటూ గుడిసె వేపు వెళ్ళిపోయాడు ప్రేంసింగ్.

అక్కడే నిలుచుని కోపంగా చూశాడు సుందరసింగ్. ప్రేంసింగ్ మీద అతనికి చాలా దినాల్నుంచి కోపంగా వుంది, తన కూతుర్ని బలవంతం చెయ్యబోయిన విషయం తెలిసినప్పటినుండీ. నారాయసింగ్ కు భయపడి, పగ దీర్చుకునే ప్రయత్నం ప్రతిదఫా వాయిదా వేయసాగాడు

గుడిసెకున్న కిటికీలోంచి చిన్న సందుగుండా ఇద్దర్నీ గమనించసాగింది లీనా. వాళ్ళ మాటలు కూడా వినిపించాయి ఆమెకు. వాళ్ళల్లో వాళ్ళకు ముసలం పుడితే ఒకరో ఇద్దరో చావటం తధ్యమనిపించింది. అందుకు ఏం చెయ్యాలాని ఆలోచించసాగింది.

ప్రేంసింగ్ తత్వం ఆమెకు తెలుసు. ఆడవాళ్ళను చూస్తే ఆంబోతులా మారతాడు. నారాయణసింగ్ ఏదైనా సహిస్తాడుగానీ, ఆడవాళ్ళ పైకి అక్రమాలు మాత్రం ఒప్పుకోడు. అతనికి భయపడి అదుపులో పెట్టుకుంటాడు ప్రేంసింగ్ తన ఆలోచనల్ని.

లీనాకు ప్రేంసింగ్ కున్న బలహీనత నుపయోగించి అతన్ని మట్టుబెట్టాలనిపించింది. అప్పుడు ఇద్దరు మాత్రమే మిగులుతారు. పాల్ సులభంగా ఎదుర్కోగలుగుతాడు.

6

ముగ్గురూ లోపలొచ్చి కూర్చున్నారు. వాళ్ళకు కొంత దూరంలో వున్న పొయ్యి దగ్గర కూర్చుని వంట చెయ్యసాగింది లీనా.

పొయ్యి మండేందుకు ఊదినట్లే పూదుతూ, రెండు మూడుసార్లు తల వెనక్కి త్రిప్పి చూసింది ప్రేంసింగ్ వైపు. అతను ఆమెనే చూస్తూండటంతో ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

లీనా ప్రేంసింగ్‌ను కవ్వించాలన్న ఊహతో, ఉక్క బోస్తున్నట్లు విసుక్కుంటూ పైట జార్చేసింది.

అందమైన, నున్నని తెల్లని వీపు భాగం చూడగానే ప్రేంసింగ్ రెచ్చిపోయాడు.

ఓరగంట లీనా అతని అవస్థ, ఉబలాటం కనిపెట్ట సాగింది.

ప్రేంసింగ్ లేచి గుడిసె వెలుపలకు వెళ్ళాడు. సుందర సింగ్, నారాయణసింగ్ సిగరెట్లు కాలుస్తూ కూర్చు న్నారు మౌనంగా.

ఐదు నిముషాల తర్వాత లోనికొచ్చి "మామా! ఆ చెట్లలో ఎవరో మనిషి పరిగెత్తినట్లు శబ్దం వినిపించింది నాకు. చూద్దాం రా!" అన్నాడు.

"పద!" అంటూ లేచారు ఇద్దరూ.

ముగ్గురూ వెలుపలికి వెళ్ళారు.

లీనాకు అర్థమైంది జరగబోయేదేమిటో. వాళ్ళు వెలు పలకు వెళ్ళగానే చిన్న రివాల్వరు తెచ్చి బాడ్లో దోపు కుంది. పొయ్యిలో మండుతున్న కట్టెలమధ్యనో పొడవాటి కత్తి కూడా దోపింది.

చెవులు రిక్కించి మనిషి అడుగుల శబ్దం కోసం విన సాగింది. పది నిముషాలపాటు ఏ విధమైన శబ్దం వినిపించ లేదు. ఆ తర్వాత ఎవరో వేగంగా గుడిసెవేపు పరుగెత్తు కొంటూ వస్తున్న చప్పుడైంది. కుడి చెయ్యి పొయ్యిలో దోపి వుంచిన కత్తి మీద పెట్టింది.

ప్రేంసింగ్ లోనికొచ్చి వికటంగా నవ్వాడు మధ్యగా నిలుచుని.

"ఏమిటా పిచ్చి నవ్వు?" తల కొంచెం త్రిప్పి అడిగింది లీనా.

"వాళ్ళిద్దర్నీ అక్కడ వదిలేసి వచ్చాను" అన్నాడు ఆనందంగా.

"ఎందుకు?"

"నిన్ను పొందేందుకు."

"మాటలు తిన్నగా రానీ! లేకుంటే..."

"వయ్యారాలు పోయిందిగాక ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నావేంటి?" అడిగాడు అడుగులు ఆమె వేపు ముందుకు వేస్తూ.

"ఆగు!" అరుస్తూ లేచి నిలుచుంది. కుడిచేతిలో వున్న కత్తి పైకెత్తింది. "అడుగు ముందుకు వేశావంటే చంపుతాను" అంది.

"చంపుతావా?" అంటూ సింహంలా ఆమె పైకి లంఘించి కుడిచేతిలో వున్న కత్తిని లాక్కున్నాడు.

పెద్ద గావుకేక పెట్టింది లీనా. ఎడం చేతిలో వున్న రివాల్వరును గురిపెట్టాలని ప్రయత్నించింది. కానీ ప్రేంసింగ్ ఆమె చేతిని సరయిన విధంగా అమరనీయకుండా అటూ ఇటూ త్రిప్పసాగాడు. తనలో బలాన్నంతా కూడగట్టుకొని ఆమె ప్రేంసింగ్‌తో పోరాడసాగింది. పెద్దగా అరుపులు పెడుతూనే వుంది.

"ప్రేంసింగ్! ఆమె నొదులు!" అప్పుడే లోనికొచ్చిన నారాయణసింగ్ అరిచాడు.

ప్రేంసింగ్ వొదలలేదు. అలాగే పెనుగులాడసాగాడు.

"మర్యాదగా వదలు. నా సంగతి నీకు తెలుసు. నా కళ్ళ ముందు ఇలాంటివి జరగడం నేను సహించను" అన్నాడు నారాయణసింగ్. కామోద్రేకంతో వున్న ప్రేంసింగ్ కు అతడి మాటలు తల కెక్కలేదు.

నారాయణసింగ్ కోపంగా తుపాకీ పైకెత్తి ట్రిగ్గర్ నొక్కాడు. వరుసగా మూడు తూటాలు ప్రేంసింగ్ గుండెలో దూరాయి. నెత్తురు పిచికారీతో చిమ్మినట్లు వెలుపలకు చిమ్ముకొచ్చింది. గిలగిల కొట్టుకుని తల వాల్చేశాడు ప్రేంసింగ్.

అతని శవాన్ని భుజాన వేసుకుని వెళ్ళిపోయాడు నారాయణసింగ్. సుందరసింగ్ కూడా అతన్ని అనుసరించాడు.

వాళ్ళు బాగా దూరం వెళ్ళిపోయారని నిర్ధారణ చేసుకొని లీనా వెళ్ళి, పాల్ ను పిలిచింది. అతను చెట్టుదిగి క్రిందికి వచ్చాడు. జరిగింది చెప్పింది.

ఆమె చెప్తూంటే తదేకంగా గమనిస్తూ విన్నాడు. మాటలు ముగించాక ఠక్కున రెండు చేతులూ ఆమె చుట్టూ వేసి గట్టిగా కౌగలించుకున్నాడు. ఆమె గిలగిల తన్నుకుంది. అయినా పట్టు వదలలేదు పాల్. తల కొద్దిగా త్రిప్పి, మోచేతి క్రింద గట్టిగా కొరికింది కండ వూడేట్లు. ఆమె చుట్టూ వున్న చేతుల్ని వెనక్కు లాక్కున్నాడు పాల్. "నాపైన నీకు ఇష్టం లేకుంటే ఇంత సాహసం ఎందుకు చేశావ్? కౌగలించుకుంటే ఎందుకని త్రోసేస్తున్నావ్?" నిలదీసి ప్రశ్నించాడు పాల్.

"నాకు నీపైన ప్రేమ లేదు. వాళ్ళపైన పగ వుంది. అందుకే చేశాను" అంది లీనా.

"కానీ, నాకు తగిన శిక్ష విధించినట్టు అనిపిస్తూంది" అన్నాడు పాల్.

"అయితే నీ దోవన నువ్వు వెళ్ళు" అంది లీనా.

"అంతేనా?" అన్నాడు పాల్.

"అంతే! దయ తలచడం, సాయం చెయ్యడం నాదే తప్పు!"

"అలాగా! వెళ్తున్నాను" అంటూ వెనక్కి చూడకుండా అంతకు ముందు తన గుర్రాన్ని వదిలివేసిన కొండ చరియ క్రిందకు నడక మొదలెట్టాడు. రాతి బొమ్మలా పాల్ వెళుతున్న వైపే చూస్తూ నిలుచుంది లీనా.

మగణ్ణి చంపినవాళ్ళపై పగ తీర్చుకోకుండా మరో మగాడి కోసం వెతికే తెగువ తనకు లేనందుకు గర్వ పడిందా క్షణంలో లీనా!

7

పాల్ క్రిందకు దిగుతుండగా, చరియ పైభాగంలో గుంట త్రవ్వి ప్రేంసింగ్ శవాన్ని అందులో వేసి మట్టి తోస్తూ వున్న సుందరసింగ్ చూశాడు. వెంటనే చేస్తున్న పనిని ఆపి, నారాయణసింగ్ దగ్గరకు వెళ్ళాడు. అతన్ని చెయ్యి పట్టుకు లాక్కొచ్చి చూపించాడు.

"ఇంతదాకా ఎక్కడున్నట్లు?" అడిగాడు నారాయణ సింగ్.

"లీనా దాచి వుండాలి, అటువేపునుండే వచ్చాడు!" చెప్పాడు సుందరసింగ్.

"వాడు ఎటునుండి వచ్చాడో వెళ్ళి చూచిరా! ఇంక తప్పించుకోవడం అసాధ్యం! ఈలోగా నేను మన గుర్రాలను తెస్తాను!" అన్నాడు నారాయణసింగ్.

సుందరసింగ్ కాళ్ళతో, చేతుల్తో గబగబ మట్టంతా

గుంటలోకి తోసి బయలుదేరాడు. నేలపైన కూర్చుని నిదానంగా పరిశీలించసాగాడు. బూట్లవత్తిడికి నేలలోకి కూరుకుపోయిన చిన్న రాళ్ళనుబట్టి ముందుకు వెళ్ళాడు ఆ జాడల వెంటే. అవి అతన్ని లీనా గుడిసె వద్దకు చేర్చాయి.

లీనా లోపల్నుంచే గమనించింది సుందరసింగును. అతను ఏం చేస్తున్నదీ ఆ తర్వాత జరగబొయ్యేదీ వూహించింది. అక్కడుంటే క్షేమకరం కాదని, గుడిసె వెనుక ద్వారంగుండా చెట్లలో పడి, తిరిగి ముందుకొచ్చి అట్నుంచి అటే పాల్‌ను అంతకు ముందు కలుసుకున్న ప్రదేశం వైపు నడక సాగించింది.

సుందరసింగ్ గుడిసెలోకి దూరాడు. ఎవ్వరూ కనుపించలేదు. లీనా పేరు పెట్టి పెద్దగా పిలిచాడు. ఆమె పలకలేదు. పిట్ట జారిపోయిందని తీర్మానించుకొని నారాయణసింగ్ కోసం వెనక్కి బయలుదేరాడు.

"ఏమైంది?" అడిగాడు నారాయణసింగ్.

"ఆమె వెళ్ళిపోయింది."

"బహుశా ఆ పాల్‌గాడి దగ్గరకే వెళ్ళి వుండాలి! గుర్రమెక్కి వెళ్దాం!" అన్నాడు నారాయణసింగ్.

"ఆమెను లొంగదీసుకోవడం అంత సులభం కాదు. మరేవన్నా మార్గం ఆలోచించాలి!" అన్నాడు సుందరసింగ్.

"తుపాకీకి కాక మనిషి మరి దేనికి లొంగుతాడు?"

"వాళ్ళ దగ్గరా వున్నాయి తుపాకీలు. వాట్ని మనపైన ప్రయోగించకుండా వుండే విధానం చూడాలి!"

"ఏమిటా విధానం?"

"లీనాకో తమ్ముడున్నాడు. వాడంటే ఆమెకు ప్రాణం. మనం వాణ్ణి దొరకబుచ్చుకుంటే ప్రాణాలకు భయం పెట్టవచ్చు."

"నా కర్మం కాలేదు."

"పాల్‌ను మనకు అందిస్తే, ఆమె తమ్ముణ్ని ప్రాణాలతో వదిలేద్దామని చెప్దాం. అలా చెయ్యకుంటే కాల్చి పారేస్తామని బెదిరిద్దాం!" అన్నాడు సుందరసింగ్.

"అలాగే! వాడెక్కడున్నాడు?" అడిగాడు సుందరసింగ్‌ను.

గొర్రెలను కాపలా కాస్తున్న లీనా తమ్ముణ్ని చూపించాడు. మారు మాట్లాడకుండా నారాయణసింగ్ గుర్రాన్ని అటు వేపు కదిలించాడు. పది నిముషాల్లో ఆ కుర్రాణ్ని గుర్రం పైన కూర్చోపెట్టుకుని వచ్చేశాడు.

నారాయణసింగ్, సుందరసింగ్ ఇద్దరూ కొండ క్రింది భాగానికి ప్రయాణం మొదలెట్టారు.

గాలి పీలుస్తూ వాసనల కోసం వెతకసాగాడు తన ముక్కు పుటాలతో సుందరసింగ్. పచ్చిక బైలు కాలుతున్న వాసన గాలిలో కలిసి కొద్ది కొద్దిగా రావటం పసిగట్టాడు.

"వాళ్ళీ ప్రాంతాల్లోనే వున్నారు!" అన్నాడు సుందరసింగ్.

"ఎలా చెప్పగలవ్?"

"చలి కాచుకునేందుకు వేసిన మంట తాలూకు వాసన వస్తూంది."

మరో రెండు నిమిషాల్లో కొండ క్రిందిభాగం చేరుకున్నారు. అక్కడ వాళ్ళకు పాల్, లీనా కనుపించిలేదు. గుర్రం కూడా లేదు. కానీ కాల్చి పారేసిన సిగరెట్ పీకలు, చలి కాచుకునేందుకు వేసిన మంట కనుపించాయి.

"జారిపోయారా?" అన్నాడు నిరుత్సాహంగా నారాయణసింగ్.

"ఎవరు?" అడిగాడు లీనా తమ్ముడు.

"నోరు మూసుకో! అనవసరంగా వాగకు!" గద్దించాడు నారాయణసింగ్.

సుందరసింగ్ గుర్రం దిగి ఆ ప్రాంతమంతా పరిశీలించాడు. దక్షిణం వేపుగా గుర్రపు డెక్కలు కనుపించాయి వాటివెంట ప్రయాణం చెయ్యసాగారు. కొండ దాటాక పెద్ద ఇసుకపర్రు కనుపించింది. పాల్ గుర్రపు అడుగులు స్పష్టంగా అందులో కనుపించాయి. వాటి వెంట గుర్రాల్ని పరుగెత్తించారు. అరగంట పోయాక కుడివేపు చిన్న నీళ్ళ గుంట దగ్గర ఎర్ర గుర్రం కనుపించింది.

"అక్కడే వున్నారు!" అన్నాడు సుందరసింగ్.

ఆ గుంట చుట్టూ పొడవుపాటి ఎత్తైన తాటిచెట్లున్నాయి.

రెండు గుర్రాల్ని అటుకేసి నడిపించారు. నారాయణసింగ్ దిగాడు గుర్రం. లీనా నీళ్ళ దగ్గరగా నిలుచునుంది.

"అతన్ని కాపాడాలనుకున్నావ్. ప్రేంసింగ్‌ను నాచేత చంపించావ్. పారిపోదామని బయలుదేరావ్. నా సంగతి అర్థమైందా? ఎక్కడున్నా వెతికి వేటాడగలను" అన్నాడు నారాయణసింగ్.

"మీరు దొంగలు, హంతకులు. అందుకే నాకు అసహ్యం. మిమ్మల్ని మట్టుబెట్టడానికే అలా చేశాను" అంది లీనా.

"అందుకే నీ కళ్ళ ముందు మీ తమ్ముడ్ని చంపేందుకు పిల్చుకొచ్చాను" అంటూ తన వెనక్కు లాగిపెట్టుకున్న లీనా తమ్ముడ్ని కాళ్ళ ముందుకు లాగాడు.

లీనా బిక్కచచ్చిపోయింది.

"వాడు పసివాడు వదిలెయ్యి" అంది లీనా.

"వదలను" అన్నాడు నారాయణసింగ్ పాల్ కోసం

చుట్టూ చూస్తూ.

నిశ్శబ్దాన్ని చీల్చుకుని నిప్పులు కురిపిస్తూ తాటిచెట్టు మొదట్లోంచి తుపాకీ గుండు తిన్నగా వచ్చి సుందరసింగ్ గుండెలో తగిలింది. చావుకేక వేస్తూ ఠక్కున కూలిపోయాడు. మరో గుండు నారాయణసింగ్ కూర్చున్న గుర్రానికి తగిలింది. పిచ్చెక్కినట్టు పరుగు తీసింది. ఆ పరుగులో నారాయణసింగ్ ను కూడా విసరివేసింది నేలపైకి.

లీనా తన దగ్గరున్న రివాల్వర్ తో మరో రెండు రౌండ్లు కాల్చింది నారాయణసింగ్ వైపు. అతని తల నేల వాలిపోయింది. చెట్టు పైనుంచి దిగివచ్చాడు పాల్.

"నీ పథకం బాగా పని చేసింది. ఎంత పరుగెత్తినా మనం వాళ్ళని తప్పించుకోలేమని తెలుసు." అన్నాడు పాల్.

"నా కోరిక తీరింది. వస్తాను!" అంది తమ్ముణ్ణి దగ్గరకు లాక్కుంటూ.

"నాకు ఎటూ పోవాలని లేదు. నీతో వుందామని వుంది మనిద్దరం కలిస్తే అడవిని పరిపాలించగలం. నిన్ను పెళ్ళి చేసుకుంటాను. ఇప్పుడు దుర్మార్గులెవ్వరూ లేరు. కాబట్టి మన వ్యాపారం గూడా బాగా జరుగుతుంది!" అన్నాడు పాల్ ఆర్ధింపుగా.

లీనా ఒక్క క్షణం పాల్ వైపు తదేకంగా చూసింది.

చిన్నగా నవ్వి "నాకూ అభ్యంతరం లేదు!" అంది లీనా సిగ్గుతో తల వంచుకుంటూ. లీనా తమ్ముడు ఇద్దరి మధ్యా వచ్చి చేయి చేయి కలిపి పట్టుకున్నాడు. ముగ్గురూ ఆనందంగా తమ గుడిసె వేపు కదిలారు.

—: ఐపోయింది :—